# సీకటి పొత్తు

అమ్మకానికి నేతిడబ్బాలు తెచ్చిన బుచ్చియ్య, సందులూరు సావుకార్లు కల్తీ నెయ్యని దగాబేరాలాడ్తంటే, ఒల్లుపొట్టు కాకమీన సావుకార్లను సెడదగిలి, రేత్రవుతుండదని జీతగాడు ఆచ్చేసు సెబుతుండా, తూత్తెరి ఈ సోంబేరి పెదేశంలో ఓ ఛణం వుండనంటా మళ్లీ డబ్బాలు దున్నకుర్రల బండికెత్తి, పయానం లెగవదీశాడు సీకట్లో కస్సు బుస్సుమంటా.

బుచ్చియ్య అయ్య శంకరయ్య, నేతి యాపారంలో వోదారికొచ్చి, తను పెద్దోడైపోటాన, కొడుకును మరో రాత్తానబడనీక, తను పైపైన తనికీకుంటా, నేతేపారంలోనే పెవేశబెట్టాడు, నాలుగుడబ్బులు సూట్టం అనుభవంలో వుంటాన.

తనకు రెటమతంగా అయ్య పెళ్లిజేసినా నోరు మెదపలేదు గాని, కాపరం ఆరంబంలో వుండి, యింటిమోజు వొదలకతలికే. ఈపస్న దున్నకుర్రలబండిమీన డబ్బాలెత్తిచ్చి, పరిసెయంలేని బయిట పెదేశాలకు ముసలాడు పంపియటం, బుచ్చియ్యకు గంగా యిట్టంలా.

ఆచ్చేసుకు పది పన్నెండేళ్లొచ్చేమయాన, అమ్మరోసెమ్మ, కొడుకును ఏదన్నా పనికిపోయెత్తుండమని సెప్పినా, నిన్నిడిసి యాడకో ఎల్లటం ఏందోగానో వుంటదని కొడుకు ముద్దులు కుడపటాన, యింకో మూడేళ్ల పాటు ఈ యిశారం తోసుకుబోయినా, పక్కశంకరయ్య కొడుకును మరికాత్తె పునాదిగెట్టి సేసుకోను, నేతేపారానికి తోలటంసూసి, యవరాలు ఆరంబంకాడ యిట్టుంటయ్యని సప్పున గెహించి, కొడుకుమీన బెమేసుకుని, బుచ్చియ్యకాడ జీతాని కంపింది ఆచ్చేసును రోసెమ్మ.

'ఈ ముసల్ది పానం తియ్యంది ఒదులుద్దీ! ఎటూకాని యాల దున్నకుర్రల్తో యీ పయానవేందీ? యియ్యాల అమా సేవో, సావు! కాత్తె నచ్చత్రాలన్నా ఆపడవేం సందడిగా!' అనుకుంటున్నాడు ఆచ్చేసు, తొట్టో కూకుని దున్నల్నదిలిత్తా.

'ఈముసలాడు కంగ్‌కంగ్ మని దగ్గుకుంటా కొంపలో ఒకటే సనుగుడైతే, ఓ పెళ్లాం, ఓమోజు, ఓకాపరం, ఏవన్నా అనుకోను యీలవుద్దా? జిడ్డు జిడ్డుగా సవ్వురు బూసకు తిరగవంటాడుగాని, పోటుపొడిసినట్టు ఈ లింగపాడు యాడుందో!' అని యిశార బడ్తుండాడు బుచ్చియ్య, బండిమీన ముసుగేసుకుని, డబ్బాల్తోబాటు వూగతా.

‘ఈ సీకట్లో లింగపాడు యాడ తగులుద్దండీ ?” అని ఆచ్చే సడిగాడు బుచ్చియ్యను.

‘నూ బండిని కదలపరా ? ఏకాడికి జిగటలు కారుత్తా జతపడ్డావు గాని !’

‘యాడేం వుందీ తెలవక, ఇది యాడుంద నడిగానండి ! యాడేంవుందో !’

‘ఈ దేడో తగులుద్దంటనే లింగపాడు ?’

‘బాగుంది ! యిగ నన్నంటండీ అడగటం ? పయానం లెగపదీత్తిరీ ! ఎల్తుం టిపీఁ ! అమాస సీకట్లో రాత్తా మద్దెనంటండీ యాడేం వుందీ తెలవందీ ? ముసిల్ది ఓటి సేసుద్దీ !’

‘నూ మెల్లో ఎండికంటెతో యావఁని ఒచ్చినట్టురా? పంబవాయిత్తా సవుఁదు కార్చాసంటే ! పానీ బండిని ! ఎవురన్నా అగుపుత్తార్లే! ఈ ముసలాడు మమ్మల్ని ఏ నక్కలకుబెట్టిందీ వూరక పానిత్తాడూ !’

‘యదవ పని ! కుదిర్నందు కనాలి యీ యదవను ! యింటికి పానీ, ముసల్దాన్ని దున్న కుర్రల బండి నెక్కియ్యకపోతే !’

‘ఎవరూ అగుపియ్యరేం ! పానీరా దబ్బునా ! ఈ దున్నకుర్రలు పుట్టి నందుకనాలి పొట్టేళ్ళకు మల్లే నిగడదీత్తా !’

‘ఆటికి మటుకు నిదరేల కాలేదంటండీ ? ఓసిపదండే, మిము సిరతగండు ఈడవా ! ఈడ సిరతగళ్లుమటుకు వుండవ నేందీ ? సల్లగా ఈ పీకి కాత్తా కొరి కేత్తే, ఆడకీ డబ్బా లెవారవేందో తేలుద్ది ! పదండే, యాడో, నిదర మొగం నాయాళ్లు దొరికారుగాని !’

గెల్లు గెల్లుమని డబ్బాల సొరాలు యినిపిత్తుంటే, సందడికి కల్లు మూసుకుని సంతోసంగా దున్నకుర్రలు పాకిపోతుండై, లింగపాడు బలాన్పోట తగులుద్దనేం లెక్కలేకండా.

* * *

‘ఏవిందోవ్! మనం ఏకాడి కొచ్చినట్టూ? కాత్తె పలకవయ్యా నీయిల్లు బంగా రంగానూ! ఈసీకట్లో డబ్బాలమీన ఎట్ట నిదురొచ్చుద్దో మడుసులికి! మొదులీ సీకటి పయానాలంటేనే నాకు వాత్తిలేకపాయె! కాత్తె లెగవయ్యా, కరుత్తాదేవోఁ నిదరకత్తన! అసలట్టాటి మడిసేలే! పేసీగా వుందే! ఆకాడి కాకాడికి ఈ సెట్లేం నచ్చిత్రాలకు లెగుత్తుండై! పానందీసి అడివికాదుగదా ? ఏం వుందయ్యో ఈడ! కాత్తె నిదరన్నా రాదేం ఈ యదవకు? బలేవోణ్ణి పుట్టాలే! ఓసిపదండే నడ్డి యిరగ దన్నే వోళ్లు లేక ! ఆవులిత్తండారుగాని !’

‘పొడవండి, నరకండి, సంపండి’-దనాదనా సెట్లల్లోంచి బూఁవి ఇరగ

దొక్కుకుంటా, ఓదానెం టోటి, రోడ్డుమీన బండిని రాసుకుంటా, ఆతల పొదల్లోకి గెంతేసి, తబతబా లగెత్తినై -'సంపు-పొడు'- అనరుసుకుంటా కర్రసాము సేత్తా రోడ్డుమీన కొచ్చి వాలా దోమడిసి.

'దెయ్యం! బూతం! రాచ్చేసి! సంపినై -ఓబుచ్చియగారో!' అని ఆచ్చేసు పాంవాణ్ణట్టాడి, తొట్టోమడి సావజానే నీలుక్కుపొయ్యాడు, బుచ్చియ్య దబ్బాల మీనుండి రాకతలికే.

'ఎవురాడ?' అనడిగాడు రోడ్డుమీన కొచ్చిన మడిసి.

'మేం బాటసార్లంగాని, యేందయ్యా ఆలగెత్తుతుండదీ?' అనడిగాడు బుచ్చియ్య మైకం వొదిలి.

'మావూరి రంగమ్మ పద్దండీ! ఏదైనా గొడ్డును కాత్తె ఇసారించకర్లా? నిసిరేత్రంటండి తాడుదెంచుక, కనపడ్డ దున్నకుర్రను లెగవడీసి, పంట సేలకు సికారొచ్చేదీ? నిన్నా అంతే! సెప్పినాకనన్నా ఆమడిసికి కాత్తె గేనం వుండకర్లా?'

'పానీలే! యిదేవూరు?'

'తపనపల్లి కాదంటయ్యా! ఏవూ రెల్తుండారేం?'

'తాటికొండకాడ తపనపల్లా?'

'మరే'

'రంగమ్మెవరు?'

'ఆఁ, నోయినకావఁయ్య పెల్లాం వుందిలే!'

'కావఁయ్య సచ్చాడా?'

'ఆరుమాసాల పైసిలు కవుతే!'

'అరెరెరె! యిప్పుడు తపనపల్లిలో వుంటందదా రంగమ్మ?'

'ఇద్దరూ వొచ్చి వుంటంటే, మొగుడు పోయే! సక్కనిపిల్ల! వొంటరి దైపోయింది.'

'ఇంకా తాటికొండలో వుంటందా రనుకుండా!'

'మీ రేడకి పోతుండారు?'

'లింగంపాడు కెల్దా వనొత్తంటే, దారిదప్పి పొయ్యాం.'

'పాతరోడ్డుకాడ రాత్తా సీలారు కావఁల్ను! అబ్బో సానాలెక్కొచ్చారే! రంగమ్మ తెల్చిన మడిసా?'

'తెలుచులే! కాత్తె ఆల్లింటికి దారి సూపిత్తాయ్యా కట్టం అనుకోక?'

'ఆఁ, కట్టం యాడికిలే! దారి కాత్తె లెవక్కసూపిత్తాగాని, రంగమ్మతో సెప్పయ్య పద్ద మల్లీ కందిసేను పాడు సేత్తుండ దని.'

'ఒరే ఆచ్చేసూ ?'

'నే రానండీ ! ఈ తపనపల్లిలో పిచ్చికుక్క లంటయ్యంట !' అన్నాడు, కాత్తె తెప్పరిల్లుకుని, మడుసులని తెల్చి, యవారాలన్నీ ఇంటుండ అచ్చేసు.

'ఎండికంటె ఎగురుద్ది యదవా ! జండిని మలుపు !'

'ఇదిగో, ఈదార్న కాత్తె లెక్కపోయినాక వూరొచ్చుద్ది. మొదట్టోనే యిమ్మగుడి వుంటదీ ! దాని కెదురుగానే కొబ్బరి సెట్లున్నయి. అదే వుందాల్లిల్లు. గుడికాడే బండి యిడుసుకోవచ్చు.'

* * *

'సాన్నాలయింది నిన్ను సూసి !' అన్నాడు బుచ్చియ్య, రంగమ్మను సూసి దిమ్మరపోయి.

'కూసో !' అంది రంగమ్మ మెల్లిగా, యింకో ఏపు సూత్తూ.

'అనుకోని యిదంగా సూశా నిన్ను !'

'వుఁ.'

'బాగుండావా ?'

'ఆఁ !'

'కావఁయ్యన్న పోయినా డంటగా ?'

'పోయి సానా కాలవఁయింది !'

'నాకు తెలవదు, రంగీ–రంగమ్మా !'

'వుఁ.'

'అసలు మీ రీడ వుంటం నాకు తెలవదు. లింగపాడుయెల్లా సీకట్లో దారి దప్పి యిటొత్తే తెలిసింది.'

'లేకుంటే ఈలయ్యేదా ?'

'ఎందుకు రం–గమ్మా నేనంటే కొత్తగా మాట్టాడ్తుండావు ? సిన్నప్పటి బావను మరిసిపొయ్యావా ?'

'అప్పే యాడదీ ?'

'రంగీ ?'

'నాపేరు రంగమ్మ ! కావఁయ్య పెల్లాన్ని !'

'.........'

"........."

'ఎట్టా మరిసిపోతా, రంగీ !'

'ఆయి నుంటే, నూ అట్టా మాట్టాడ్తా ?'

'లేదు, లేదు-ఏడుత్తుండా-రంగమ్మా? పానీ నేనే ఎధవను!'

'.........'

'ఎన్నాలయింది నిన్ను సూసి! ఎంత మారిపొయ్యావు!'

'నే నెట్టబోతే ఎవురికేం!'

'అంతేనా! నిన్ను సూత్తుంటే ఎంత సంతోసంగుందీ, నీ కెట్ట తెలుసుద్దీ? సిన్నప్పుడు మనం ఎట్టా వుండేవోల్లం!'

'నో రెట్టొచ్చుద్దీ ఆ మాటలకూ? అయిదు సమచ్చరాలయింది నా పెల్లయి! యదవ సచ్చిందాన్ని కాబట్టి, నే తలుసుకు సచ్చాగాని, బతికున్నాడయితే రాక పొయ్యేవోడా!'

'నూ పెల్లి సేసుకున్నాక నే నేడ గాపకం వుంటాను?'

'ఈ నోల్లకేం అద్దులుంటేగా! మీ అయ్యకు ఈ బూమినంతా మింగా లనుంటే, ఆడదానివైనాక ఆస నీవల్ల నవుద్దా? సచ్చియాడుండదో మా అమ్మ! అన్నా అన్నా అని ఎంత బతివిఁలాడింది అల్లుణ్ణి కూతురి కిచ్చుకుంటానని! ఆ వుండ బూమిని రాసిత్తే, పెల్లి సేత్తాడంట! ఈడు మేనమావాఁ-అనగూడదుగాని! యిన్నెవారాలు నడుత్తుంటే నీ కల్లేదకి బోయిన్నై? 'రంగీ! నిన్ను దప్ప చేసు కోనే!' అని నోరు బార జాత్తివే? అప్పుడేడకు బోయిందీ యీ బుద్దీ? యింక 'నే గాపకం వుంటానూ' అనడుగుతా? ఏ చంగతి తెలుసుం డా మాటన్నా? నిన్ను సూత్తుంటె ఎంత మండుతుండది లోన!'

'రంగీ!'

'సీ! నాకాడ మాట్టాడమాకు!'

'ఎందుకంతకోపం, రంగీ, నన్ను సూత్తై? సిన్నప్పుడు నన్ను సూత్తే ఎంత యిట్టంగుండేదానివి! ఓ రోజున నీకు సెప్పకుండా, గారడి సూడను నేనెల్తే, బూడినక, ఏడిత్తివే బావ బావఁటా? అయన్నీ మరిసిబొయినా? మా అయ్య ఎటువొంటివో డయిందీ నీకు తెలవదూ? నిన్ను దప్ప నే నింకోర్ని పెల్లాణ్ణని మొరాయిత్తే, నూ కొడుకువు గాదని, నన్నింటోంచి లెగిసిపొమ్మన్లా? సీల్చేత్తా నన్లా నన్నూ? అనక నూ పెల్లి సేసుకుంటివి! యియ్యన్నీ నీకు తెలవదా, రంగీ?'

'ఎందుకు తెలవదూ? యిప్పుడు మీ అయ్య నన్ను సూడ బంపాడనీ తెలుసు!'

'ఎవురి పాపాన వారు పోతారు! నిన్ను సూశా ఎట్టనవుతె!'

'ఏం లాబం?'

'నూ యింత అందం గవుతావని నే నెప్పుడనుకోలా, రంగీ !'

'వూఁ !'

'సిన్నప్పుడు ఓ రోజున, సందేల, మీమెట్టసేలో జొన్నకంకులు నలుసుకు తిన్నాక—గాపకం వుందా ?'

'.........'

'ఆనాడు రేత్రి మంచంకాడి కొచ్చి కాలుగీరివే ?'

'అయన్నీ తలుసుకునేదాన్ని ! ఎం తేడుత్తే మటు కేంలాబం ! యిప్పటి కొత్తివి !'

'ఎంత బయపెట్టావు, రంగీ ? నే ఎన్నిసార్లు తలుసుకుండా నిన్ను !'

'ఎంత బారీగా అయ్యావురా ! యింకా సొట్టలు పడ్తుఁదయ్యే నీ బుగ్గలు !'

'యిప్పటికీ సిన్నరంగి మాటలే నీయి !'

'నీయి మటుకు ? యిన్ని గిరజా లెప్పుడు పెంచావురా !'

'నీ మొగం మెరుత్తుండదే !'

* * *

తెల్లారేయాలకు ఆచ్చే సొచ్చి దబదబ తలుపు దట్టాడు.

'ఓ బుచ్చియ్యగోరు, బుచ్చియ్యగోరూ ? లెగవండయ్యా, లెగవండయ్యా ? ఆ పెదరాసిన నేతిడబ్బా లావజాన కాలీ అయిపాతందే ! పొడుకుండ గోతాఁవంతా యనిగిపాయే ! మీ అయ్య సావదన్నాడు దొబ్బున రావయ్యా ? తెల్లగ తెల్లారింది లెగవ్వయ్యా, నీయిల్లు బంగారంగాను !'

తత్తరబుట్టి లెగిశాడు బుచ్చియ్య.

'రంగీ, ఎల్లొత్తా ! ఆటి సంగతేందో సూసి దబ్బున లింగపాడెల్లి పోవాలి ! ఎటూ అయ్య సేతిలో తప్పవు !'

'అట్ట పొనికిపోతా వెందుకూ ? యెల్లవులే !'

'ఆఁ నీ కేం తెలుసుద్ది ! సంపడూ ! మల్లీ వొత్తాగా ?'

'?'

'యెల్తుండా !'

'—బతికుండి మల్లీ రామాకు !'

*